GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in


# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 224 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శుక్రవారం : మార్చి 29-2024 | పేజీలు : 3

## గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి



**టీ మీడియా, మార్చి 28, హైదరాబాద్ :** ఈ నెల 29వ తేదీన గుడ్ ఫ్రైడే సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి క్రిస్టియన్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు త్యాగాన్ని, ధైర్యాన్ని గుర్తు చేసుకున్నారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. క్రీస్తు త్యాగాల జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.వందరోజుల మా పాలన సంతృప్తినిచ్చింది : రేవంత్ రెడ్డి 37 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం బీఆర్ఎస్ కు మరో షాక్ సోనియాతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి నేతల కోసం కాదు.. రైతుల కోసం గేట్లు తెరవండి: హరీశ్‌రావు కాంగ్రెస్ అనాలోచతో పూర్వపు కరువు : మాజీ ఎంపీ వినోద్

# కాంగ్రెస్ ఇల్లు ఖాళీ అవుతోంది



- పదేళ్లలో399 మందిముఖ్య నేతలు ఫిరాయింపు
- నరేంద్ర మోదీ చెలగాటం తో పార్టీకి ప్రాణసంకటం
- భారతీయ జనతా పార్టీలోకి అత్యధిక చేరికలు

**టీ మీడియా,మార్చి 28,ఢిల్లీ :**

### కాంగ్రెస్ ని వీడిన కొందరు ప్రముఖ నేతలు

మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా 22 మంది ఎమ్మెల్యేలతో కలిసి 2020లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఈ చేరికతో మధ్యప్రదేశ్?లో అప్పటి వరకు కమల్‌నాథ్ ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. ఇదే రాష్ట్రంలో సురేష్ పచౌరి అనేక ఇతర మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పార్టీ మారారు. మహారాష్ట్రలో 2019 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మాజీ సిఎం నారాయణ్ రాణే, ఆయన క్యాబినెట్ సహచరుడు హర్షవర్ధన్ పాటిల్‌లు కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరారు. తాజాగా మాజీ సీఎం అశోక్ చవాన్, మిలింద్ దేవరా, బాబా సిద్ధిక్ వంటి నేతలు కాంగ్రెస్‌ను వీడి బీజేపీ సహా వేర్వేరు పార్టీల్లో చేరారు.ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు జగదాంబిక పాల్ సహా రీటా బహుగుణ జోషి, రవి కిషన్, అమర్‌పాల్ త్యాగి, ధీరేందర్ సింగ్ వంటి నేతలు 2014, 2016. 2017లో జరిగిన ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. 2021లో జితిన్ ప్రసాద సహా మరో 22 మంది ఇతర నాయకులు కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టారు. 2022లో ఆర్‌పిఎన్ సింగ్ కాంగ్రెస్‌తో తన మూడు దశాబ్దాల బంధానికి ముగింపు పలికారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని వీడిన ముఖ్య నేతల్లో కపిల్ సిబల్, కృష్ణ తీరథ్, రాజ్ కుమార్ చౌహాన్, బరా? సింగ్ తదితరులు ఉన్నారు.గుజరాత్‌కు చెందిన అర్జున్ మోద్వాడియా 40 ఏళ్ల తర్వాత కాంగ్రెస్‌ను వీడారు. అల్పేష్ ఠాకోర్, హార్దిక్ పటేల్, రోహన్ గుప్తా వంటి ప్రముఖ నేతలు కాంగ్రెస్ వీడినవారి జాబితాలో ఉన్నారు. కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ కూడా కాంగ్రెస్‌తో తన 50 ఏళ్ల అనుబంధానికి స్వస్తి పలికారు. పంజాబ్‌లో మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్, కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి జైవీర్ షెర్గిల్, సునీల్ జాఖర్, అశ్వనీ కుమార్, రవ్‌నీత్ సింగ్ బిట్టు పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లోకి జరుగుతున్న వలసల ప్రవాహం ఇక్కడితో ఆగిపోలేదు. అదింకా కొనసాగుతూనే ఉంది.

### పార్టీ వీడి వెళ్లిన ప్రముఖ నేతల్లో..

జమ్మూ&కాశ్మీర్: గులాం నబీ ఆజాద్, ఒ,డిశా: భువనేశ్వర్ కలితా, హిరణ్య భూయాన్ఆంధ్రప్రదేశ్: కిరణ్ కుమార్ రెడ్డి,తమిళనాడు: సీఆర్ కేశవన్,కేరళ: అనిల్ ఆంటోనీ, టామ్ వడక్కన్,ఛత్తీస్‌గఢ్: రామ్‌దయాల్ ఉయికే,ఉత్తరాఖండ్: విజయ్ బహుగుణ, సత్పాల్ మహారాజ్,గోవా: దిగంబర్ కామత్, రవి నాయక్,అస్సాం: హిమంత బిస్వా శర్మ, సుస్మితా దేవ్,మణిపూర్ %--% ఎన్ బీరెన్ సింగ్,అరుణాచల్ ప్రదేశ్ %--% పేమా ఖండూతెలుగు రాష్ట్రాల్లో%ూ%తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇతర పార్టీల్లోకి వలసలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి పదవి తనకు దక్కకుండా కాంగ్రెస్ అధిష్టానం వ్యవహరించడంతో రాజశేఖర రెడ్డి కుమారుడు జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ వీడి బయటికొచ్చారు. ఆయన వెంట అనేక మంది పార్టీని వీడి జగన్మోహన్ రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం తలా ఓ పార్టీకి చెల్లాచెదురయ్యారు.ఏకంగా అప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డే స్వయంగా కాంగ్రెస్ పార్టీని వీడి సొంతంగా సమైక్యాంధ్ర పార్టీ పెట్టుకున్నారు. ఆ ఎన్నికల్లో ఓటమి అనంతరం రాజకీయాల నుంచి కొన్నేళ్లు దూరంగా ఉండి మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగొచ్చారు. కానీ ఆ పార్టీలో మార్పు ఏమీ లేదనుకున్నారో.. లేక భవిష్యత్తు లేదు అనుకున్నారో తెలియదు.. చివరకు మరోసారి కాంగ్రెస్ పార్టీని వీడి ఈసారి బీజేపీలో చేరారు. ఇప్పుడు రాజంపేట లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.అలాగే 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన దగ్గుబాటి పురందేశ్వరి ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. గత పదేళ్లుగా బీజేపీలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం ఏపీ అధ్యక్షురాలిగా ఉన్నారు. రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ ఒకప్పుడు ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. కేంద్ర మంత్రులు, సీఎం, పీసీసీ అధ్యక్షులుగా పనిచేసినవారే కాదు.. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా పనిచేసిన అనేక మంది కాంగ్రెస్ వీడి వేర్వేరు పార్టీల్లో చేరారు. సరిగ్గా లెక్కిస్తే ఆ సంఖ్య వందల్లో ఉంటుందిఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన డి. శ్రీనివాస్, కే. కేశవరావుతో పాటు తెలంగాణ తొలి పీసీసీ చీఫ్‌గా పనిచేసిన పొన్నాల లక్ష్మయ్య వంటి నేతలు కాంగ్రెస్ పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన డికే అరుణ 2019లో బీజేపీలో చేరారు. ఇప్పుడు పార్టీలో జాతీయ ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తూ.. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి కుమారుడు మర్రి శశిధర్ రెడ్డి కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో కాంగ్రెస్ వీడినవారి సంఖ్య అంత ఎక్కువేమీ కాకపోయినా.. కీలక పదవుల్లో పనిచేసిన నేతలు పార్టీ వీడడం గమనార్హం.ఎందుకిలా జరుగుతోంది అన్న ప్రశ్న తలెత్తితే.. కొన్ని వలసలకు స్థానికంగా, రాష్ట్ర స్థాయిలో నాయకత్వంతో విభేధాలు, ఇతర పార్టీల్లో మెరుగైన అవకాశాలు కారణమైతే.. ఓవరాల్‌గా జాతీయ స్థాయిలో నాయకత్వం తీరు కారణమన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి గుండెకాయలాంటి గాంధీ-నెహ్రూ కుటుంబంలో రాహుల్ గాంధీ పార్టీలో పాత, కొత్త తరం నేతలకు కలుపుకునిపోలేకపోవడం, భవిష్యత్తుపై వారికి భరోసా కల్పించలేకపోవడం, దశాబ్దాలుగా పదవులు అనుభవిస్తున్న నేతలకే తప్ప కొత్తవారికి అవకాశాలు, బాధ్యతలు కల్పించలేకపోవడం వంటి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు వరుసగా ఎదురవుతున్న పరాజయాలు సైతం ఆ పార్టీలో ఉన్న నేతల్లో నైరాశ్యాన్ని నింపుతున్నాయి. దీంతో గెలిచే పార్టీలో చేరితే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ వీడి బీజేపీ సహా దేశంలోని ఇతర పార్టీల్లో చేరుతున్నారు. అలా ఈ వలసల ప్రవాహం కొనసాగుతూ కాంగ్రెస్ ఇల్లు ఖాళీ అవుతోంది.

**రాజకీయాల్లో నేతలు పార్టీలు మారడం కొత్త విషయమేమీ కాదు. ఎన్నికల వేళ ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ఫిరాయింపులు జరుగుతుంటాయి. ఈ మధ్య ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా ఫిరాయింపులు ఎక్కువే జరుగుతున్నాయి. ఏదేమైనా నేతల ఫిరాయింపులకు గతంలో మాదిరిగా సైద్ధాంతిక విభేధాలతో, అగ్రనాయకత్వంతో స్పర్థలో కారణం కాదు.. పదవులు, అధికారమే పరమావధిగా ఈ గోడ దూకడాలు ఎక్కువగా జరుగుతున్నాయి.గత పదేళ్లకాలంలో జరిగిన పార్టీ ఫిరాయింపులను ఓసారి పరిశీలిస్తే.. భారతీయ జనతా పార్టీలోకి అత్యధిక చేరికలు నమోదు కాగా, అత్యధిక సంఖ్యలో నేతలను కోల్పోయిన పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. అంటే ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో జరుగుతున్న చెలగాటం కాంగ్రెస్ పార్టీకి ప్రాణసంకటంగా మారింది. 2014 నుంచి ఇప్పటి వరకు 399 మంది కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీ ఫిరాయించగా.. వారిలో ఎక్కువ మంది బీజేపీలో చేరారు. ఇందులో 11 మంది ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేతలున్నారంటే అతిశయోక్తి కాదు. 2014 నుంచి 2021 మధ్య, గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ నుంచి పార్టీ మారిన 399 మంది ముఖ్యనేతల్లో 177 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.తాజాగా కాంగ్రెస్ నేత, వ్యాపార దిగ్గజం నవీన్ జిందాల్ కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆ వెంటనే విడుదలైన బీజేపీ అభ్యర్థుల జాబితాలో ఆయన పేరు కనిపించింది. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసిన 6 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం, ఆ వెంటనే అభ్యర్థులుగా ప్రకటించడం కూడా చకచకా జరిగిపోయాయి. ఇది కేవలం ఒక రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాలేదు. దేశమంతటా ఈ తరహాలో పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి.**

## బండి సంజయ్ పై కేసు

**టీ మీడియా, మార్చి 28,హైదరాబాద్ :**



మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్ పై కేసు నమోదైంది. చెంగిచర్లలో పిట్టల బస్తి బాధితులను పరామర్శించడానికి బండి సంజయ్, అతని అనుచరులు రాగా, పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో కింద పడిన నాచారం సీఐ నందిశ్వర్ రెడ్డికి గాయాలయ్యాయి. సీఐ ఫిర్యాదుతో బండి సంజరుతో పాటు మరో పది మందిపై 332, 353, 143, 149 ఐపీసీ 3, 4పీడీపీపీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో వంద శాతం పోలింగ్

### -ఓటు హక్కు వినియోగించుకున్న రేవంత్



టీ మీడియా, మార్చి 28, మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోడంగల్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల కోటా శాసనమండలి ఉప ఎన్నిక కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4గంటవరకు కొనసాగింది . ఈ ఎన్నికల్లో 1439 మంది స్థానిక సంస్థల ఓటర్లు ఉన్నారు. వీరిలో 888 మంది ఎంపీటీసీలు, 83 మంది జెడ్పీటీసీలు, 449 మంది కౌన్సిలర్లు 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. ఈ ఎన్నికలలో మొత్తం ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు..వంద శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు..ఇక, ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ పోటీలో ఉన్నారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏప్రిల్ రెండో తేదిన నిర్వహించి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు..

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈడీ కస్టడీ పొడిగింపు



**టీ మీడియా, మార్చి 28, న్యూఢిల్లీ :**

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. కస్టడీ గడువు ముగియడంతో ఆయనను ఈడీ కోర్టు ఎదుట హాజరుపరిచింది. ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్, ఈడీ వాదనలు వినిపించాయి. ఈడీ విజ్ఞప్తి మేరకు కోర్టు ఏప్రిల్ ఒకటి వరకు కస్టడీని పొడిగిస్తూ తీర్పును వెలువరించింది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ వాంగ్మూలం ఇస్తూ.. సీబీఐ ఆగస్టు 17, 2022న కేసు నమోదు చేసిందని తెలిపింది.ఈడీ 2022 ఆగస్టు 22న ఈసీఐఆర్ దాఖలు చేసిందని తెలిపారు. నన్ను అరెస్టు చేసినా.. ఇప్పటి వరకు ఏ కోర్టు దోషిగా తేల్చలేదన్నారు. తనను ఎందుకు అరెస్టు చేశారని అడగాలనుకుంటున్నానన్నారు. కేవలం నలుగురి ప్రకటనల్లోనే తన పేరు కనిపించిందని చెప్పారు. ఈడీ రూ.100కోట్ల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈడీ విచారణ తర్వాతే అసలైన మద్యం కుంభకోణం ప్రారంభమైందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడమే ఈడీ లక్ష్యమని.. ఈడీ బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఈడీ దోపిడీ రాకెట్ సాగుతోందని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్ ప్రకటనను ఈడీ వ్యతిరేకించింది. గోవా ఎన్నికలకు హవాలా ద్వారా డబ్బులు వినియోగించారని ఈడీ తెలిపింది. కేజ్రీవాల్ మొత్తం విచారణను గందరగోళానికి గురి చేయాలనుకుంటున్నారని.. ఈ అంశం ఇంకా దర్యాప్తు దశలోనే ఉందని ఈడీ పేర్కొంది. గోవా ఎన్నికలకు రూ.100కోట్ల సొమ్మును ఆమ్ ఆద్మీ పార్టీకి అందినట్లుగా ఈడీ ఆరోపించింది. మొబైల్ డేటాను రికవరీ చేసినట్లు ఈడీ పేర్కొంది. పలు డివైజ్‌లలో ఉన్న డేటాను రికవరీ చేయాల్సి ఉంది పేర్కొంది.



## కాంగ్రెస్‌లోనే చనిపోతానన్న కేకే

### -కేసీఆర్ సీరియస్ -బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: కేకే తనయుడు

**టీ మీడియా, మార్చి 28,హైదరాబాద్ :**బీఆర్ఎస్ సీనియర్ నేత కే.కేశవరావుపై గులాబీ బాస్ కేసీఆర్ సీరియస్ అయ్యారు. పార్టీ మారతానని స్పష్టం చేసిన కేకేకు ఆయన క్లాస్ తీసుకున్నారు. ఇటీవల కేకే వ్యవహరిస్తున్న తీరుపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నీ ఫ్యామిలీకి పార్టీ ఏం తక్కువ చేసింది? అంటూ కేకేపై కేసీఆర్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేసీఆర్ తో భేటీలో.. తాను పార్టీ మారతానని స్పష్టం చేశారట కేకే. కాంగ్రెస్ లోనే చచ్చిపోతానని కేకే తేల్చి చెప్పారట. పదేళ్లు అధికారం, పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారతానంటే ప్రజలు గమనిస్తారు అని కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. మీ ఆలోచన మార్చుకోండి అని కేకే కు సూచించారట కేసీఆర్.

### ఈ నెల 30న కాంగ్రెస్‌లో చేరుతున్నాం: కేకే

**టి మీడియా, మార్చి 28,హైదరాబాద్:** తాము కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నేత కే కేశవరావు, ఆయన కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి గురువారం స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీన తాము అధికార పార్టీలో చేరుతున్నామని వెల్లడించారు. అధికార పార్టీలో ఉంటేనే పనులు జరుగుతాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలని అనుకుంటున్నామని కే కేశవరావు కూడా వెల్లడించారు. తాను గతంలో సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని గుర్తు చేశారు. 84 ఏళ్ల వయస్సులో తాను తిరిగి సొంత పార్టీలోకి వెళ్లాలనుకుంటున్నానన్నారు.

### బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: కేకే తనయుడు

తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగనున్నట్లు కేకే కుమారుడు విప్లవ్ కుమార్ వెల్లడించారు. తన తండ్రి, సోదరి నిర్ణయాలతో తనకు సంబంధం లేదన్నారు. తాను పార్టీ మారే ప్రసక్తి లేదన్నారు. కేసీఆర్‌పై నమ్మకం ఉందన్నారు.

## సెల్ఫీలు, అప్యాయ పలకరింపులు..

### పాదయాత్రను గుర్తు చేస్తున్న జగన్ బస్సు యాత్ర..



**టీ మీడియా,మార్చి 28,నంద్యాల:**

మేమంతా సిద్ధం బస్సు యాత్రతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు ఏపీ సీఎం జగన్. ఇడుపులపాయలో మొదలైన బస్సు యాత్ర నంద్యాల జిల్లా మీదుగా సాగుతోంది. ఇదిలా ఉంటే యాత్రలో సీఎం జగన్ ప్రజలను అప్యాయంగా కలుస్తున్నారు. వారి సమస్యలు గురించి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం అందించిన పథకాలు, కార్యక్రమాలతో లబ్ది పొందిన పలువురు.. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.బస్సు యాత్ర పొడవునా సీఎం జగన్‌కు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రలో ముందుకు సాగుతున్నారు సీఎం జగన్. కొన్ని చోట్ల ప్రజలను కలుస్తున్న సీఎం జగన్ వారిని అప్యాయంగా పలకరిస్తున్నారు. సీఎం జగన్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడుతున్నారు. వైసీపీ అధినేత సైతం చాలా చోట్ల తనను కలుస్తున్న వారితో సెల్ఫీలు దిగుతున్నారు. గత ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు వైఎస్ జగన్. ఆ సమయంలో ప్రజలతో ఎంతగానో మమేకమయ్యారు.ప్రతి చోట ప్రజలను అప్యాయంగా పలకరించారు. పాదయాత్ర సమయంలో కొన్నాళ్లు ప్రజల్లోనే ఉన్న వైసీపీ అధినేత.. అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం పూర్తిగా పరిపాలన మీదే దృష్టిపెట్టారు. సమీక్షలు, సమావేశాలతో బిజీ అయిపోయారు. అప్పుడప్పుడు బహిరంగ సభల్లో పాల్గొన్నా.. కేవలం కొందరిని మాత్రమే కలిశారు. అయితే ఎన్నికల ప్రచారం కోసం మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర చేపట్టిన సీఎం జగన్.. మరోసారి పూర్తిగా జనంతో మమేకమవుతున్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని గతంలో మాదిరిగానే అప్యాయంగా పలకరిస్తున్నారు. కొన్ని చోట్ల స్వయంగా తానే ప్రజల దగ్గరకు వెళ్లి వారితో మాట్లాడుతున్నారు. వారితో కలిసి సెల్ఫీలు దిగుతున్నారు. సీఎం జగన్‌ను చూసిన చాలామంది.. ఒకప్పుడు పాదయాత్రలో జగన్ తమను పలకరించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఇడుపులపాయలో మొదలైన సీఎం జగన్ బస్సుయాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగనుంది. పేరుకు బస్సుయాత్రే అయినా%ూ% పాదయాత్ర తరహాలోనే చాలామందిని కలుస్తున్నారు వైఎస్ జగన్. మొత్తంగా ఈ యాత్ర ద్వారా మరోసారి ప్రజలకు తన పాదయాత్రను గుర్తు చేస్తున్నారు.

# భానుని భగభగ సుర్రు మంటున్న ఎండలు

## విచ్చలవిడిగా జ్యూస్ సెంటర్లు

- ప్రభుత్వం నిఘా పెట్టాలి

**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**

గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. గత వారం రోజుల నుంచి తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ప్రజలు ఉదయం 11 గంటలకే ఇండ్లకే పరిమితం అయిపోతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు కూడా మధ్యాహ్నం వేళలో భానుని భగభగ మాటలకు తట్టుకోలేక తల్లడిల్లి పోతున్నారు. ఎండాకాలం ప్రారంభమైన పది రోజుల సమయంలోనే మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్ర రూపం దాల్చి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి ప్రజలు ముఖ్యంగా స్త్రీలు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో ఎక్కడ చూసినా కూల్డ్రింక్ షాపులు, వాటర్ బాటిల్స్, టెంకాయ నీళ్ళ, మజ్జిగ ,జ్యూస్ వంటి షాపులకు ప్రజలు ఎగబడుతున్నారు. ఇదే అదునుగా భావించి షాపు యజమానులు వినియోగదారుల నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న ఈ తరుణంలో వ్యాపారస్తులు పండుగ చేసుకుంటున్నారు. వాటర్ బాటిల్ కొనుగోలు చేయాలంటే 20 నుంచి 30 రూపాయలు చెల్లించాల్సిందే, మజ్జిగ త్రాగాలంటే 20 నుంచి 25 రూపాయలు చెల్లించాలి. కూల్ డ్రింక్స్ విషయానికొస్తే మరీ అధ్వానంగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి బోండా నీళ్ల ధర 80 రూపాయల పలుకుతుంది. ఇప్పుడే ఎండాకాలం ప్రారంభం దశలో ధరలు ఈ విధంగా ఉంటే ఏప్రిల్ మే నెలలో ప్రజల స్థితిగతులు ఏ విధంగా ఉంటాయో అనే ఆందోళన వ్యక్తం అవుతుంది. మండుతున్న ధరలతో ఎండుతున్న గొంతులతో ప్రజల దాహం తీరక డిహైడ్రేషన్కు గురవుతున్నారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్వచ్ఛంద



సంస్థ ద్వారా ట్రస్టుల ద్వారా ప్రతి మండల కేంద్రంలో గ్రామాలలో జిల్లా కేంద్రాలలో అంబలి కేంద్రాలతో పాటు చలివేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఎండలకు ప్రజలు తట్టుకోలేక వడదెబ్బకు గురై చనిపోయిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే జాగ్రత్తపడి ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇది ఈ విధంగా ఉండగా ఉపాధి హామీ పథకంలో కూలీలు వడదెబ్బకు తట్టుకోలేక మృత్యువాత పడొచ్చు. నిర్లక్ష్యం చేస్తే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకం కూలీలు పిట్టల రాగ రాలిపోయే ప్రమాదం ఉందని చెప్పవచ్చు, ఉపాధి హామీ కూలీలతోపాటు వ్యవసాయ కూలీలు తమ తమ వ్యవసాయ పొలాలలో పనులు నిమిత్తం వెళ్లి వడదెబ్బకు గురై ప్రమాదం పొంచి ఉంది, నాణ్యత లేని వాటర్ మానేతలేని కూల్డ్రింక్స్ జూసు సెంటర్లలో కూడా మురిగిపోయిన పండ్ల ద్వారా జూసు తయారు చేసి విక్రయిస్తున్నారని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్లు అడ్రస్ లేకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలిపెట్టి వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నప్పటికీ నాణ్యతలేని కల్తీ విక్రయాల పైన చర్య తీసుకోవాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎక్కడ ఉన్నాడో కూడా ఎవరికి తెలియదు. కల్తీ ఫ్రూట్స్ తో పాటు జూస్ సెంటర్ల పైన నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్లు తక్షణమే ఫుడ్ ఇన్స్పెక్టర్లను రోజు రోజు తనిఖీలు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. భానుని ప్రతాపానికి తట్టుకోలేక ప్రజలు సేద తీసుకోవడానికి గొడుగులు కొనుగోలు చేయడానికి పోతే ఒక్కొక్క గొడుగు ధర 300 నుంచి 500 రూపాయలు పలుకుతుందని అదేవిధంగా కాటన్ బట్టల పైన కూడా ధరలు విపరీతంగా పెంచి వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ముందు ముందు ఎండలు ముదురక ముందే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నాణ్యమైన త్రాగునీటి సరఫరాతో పాటు జూసు సెంటర్లలో మురిగిపోయిన ఫ్రూట్స్ విక్రయించకుండా అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.







## రైతుల నీటి సమస్యను పరిష్కరిస్తా

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆరో వార్డు మెట్టుపల్లి రైతుల కోరిక మేరకు గురువారం ఈదుల చెరువును రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సందర్శించడం జరిగింది. అక్కడ రైతులు చెప్పినటువంటి సమస్య ఏమిటంటే ఈదుల చెరువు నుండి మోటార్ల ద్వారా నీరు ఎత్తిపోసి రంగం గడ్డ నందిమల్లగడ్డ వేపుల గడ్డ మెట్టుపల్లి మెట్టుపల్లి తాండ దాదాపు 2 వేలు ఎకరాలు విస్తీరంలో ఉన్నటువంటి పొలాలను నీరు వేసవి కాలం వచ్చిన వెంబడే ఆ యొక్క మోటార్లకు నీళ్లు అందక ఈ యొక్క పంట పొలాలు ఎండిపోతున్నవని అని దృష్టికి తీసుకువెళ్లినారు. చిన్నారెడ్డి ఆ యొక్క మోటార్ల ఉండే ప్రాంతానికి వెళ్లి ఆ యొక్క మోటార్లు ఎక్కడైతే లోతు ఎక్కువగా ఉండే పుష్కలంగా నీళ్లు మోటార్లకు అదేవిధంగా ఆ యొక్క లోతు ఎక్కువగా ఉండే ప్రాంతానికి మార్చుకోవాలని ఆ రైతులకు సూచించి అట్టి మోటార్లను మార్చడానికి పైపులు గాని విద్యుత్తు గాని అన్నిటిని కూడా అతి తొందరలోనే శాంక్షన్ చేపించి ఆ మోటార్లను లోతు ప్రాంతంలో పెట్టిచ్చి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని మెట్టుపల్లి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఫిషర్మెన్ కమిటీ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, మొగిలి సత్య రెడ్డి, రాగి వేణు, మొజర్ల మన్యం, బాలరాజ్, కురుమూర్తి, నాగన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ రాలేదని సిట్టింగ్ ఎంపీ గణేష్ మూర్తి ఆత్మహత్య..!

**టీ మీడియా,మార్చి 28,కోయంబత్తూరు :**



కొద్దిరోజుల క్రితం తన నివాసంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఈరోడ్ ఎంపీ గణేశమూర్తి కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తమిళనాడులోని ఈరోడ్ నుంచి ప్రస్తుత లోక్సభ ఎంపీ, ఎం డి ఎం కె కి చెందిన ఎ. గణేష్మూర్తి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గురువారం ఉదయం 5:05 గంటలకు గుండెపోటు కారణంగా ఆయన మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఎండిఎంకెకు చెందిన గణేష్ మూర్తి ఈరోడ్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్నారు. ఈసారి ఈరోడ్ నియోజకవర్గాన్ని డీఎంకే కైవసం చేసుకుంది. దీంతో గణేశమూర్తికి అవకాశం ఇవ్వలేదు. దీంతో డిప్రెషన్లో ఉన్నాడని అంటున్నారు. మార్చి 24 న లోక్సభ ఎన్నికలకు టికెట్ రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేష్ మూర్తి తన ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కోయంబత్తూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్చారు కుటుంబసభ్యులు. కాగా, అతను చికిత్స పొందుతుండగా ఇవాళ ఉదయం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి.

## కుటుంబ పెత్తనం.. అధికారం పై ఆశ

- కోట్లాది రూపాయలు ఉన్న పదవి కోసం ఆరాటం

**టీ మీడియా, మార్చి 28, గోదావరిఖని:**

పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబ పెత్తనం తోనే అధికారం చేజిక్కించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ లు పేర్కొన్నారు. గోదావరిఖని సాయి లీల హెూటల్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా వారి కుటుంబ సభ్యుల్ని అధికారంలోకి రాణించి దోపిడికి పాల్పడదామని, వేల కోట్ల ఆస్తులను పోగు చేసుకొని కాపాడుకుందాం అని చూస్తున్నారని, వారి ఎత్తుగడలను తగ్గించి పెద్దపల్లి పార్లమెంట్ సుపరిచితుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. గోదావరిఖని, ధర్మపురి నియోజకవర్గాల్లో పనిచేసిన అనుభవం, బొగ్గు గని కార్మికుల విషయాలు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అన్నివేళలా ఉంటానని, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు మంత్రిగా వ్యవహరించిన కొప్పుల ఈశ్వర్ హయాంలో నూతన పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ఉచితంగా విద్య, వైద్యం కల్పించారని, భారాస పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీవారు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. బిజెపి పార్టీ వారు రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ గడ్డం వివేక్ కుటుంబం ఏమైనా సామంత రాజులనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇక్కడ ప్రజలు మేధావులు ఆలోచించి ఈ ప్రాంతంలో టిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, కృష్ణవేణి, మురళీధర్ రావు, శంకర్ గౌడ్, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.






## మైనంపల్లి హనుమంత్ రావు ని కలిసిన నీలం మధు ముదిరాజ్

**టీ మీడియా, మార్చి 28, మెదక్ :**

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు గారిని కలిశారు. ఎంపీ అభ్యర్థిగా తన ఎంపికలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకి సంపూర్ణ ఆశీస్సులు కావాలనీ కోరారు. వచ్చే ఎన్నికల్లో మీ సలహాలు, సూచనలకు అనుగుణంగా ప్రచారంలో ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని మెదక్ పార్లమెంటు లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ పరిధిలో అందరితో కలుపుగోలుగా ఉంటూ ప్రచారంలో ముందుకు పోవాలని సూచించారు.

## సిపిని కలిసిన ఆర్ఎఫ్సిఎల్ సిజిఎం

**టీ మీడియా, మార్చి 28, గోదావరిఖని:**




రామగుండం పోలీస్ కమిషనర్ గా ఎం శ్రీనివాస్ ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం ఆర్ఎఫ్సిఎల్ సిజిఎం సుధీర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సిఎల్ లో రక్షణ చర్యలతో పాటు వివిధ అంశాలను సిపికి వివరించారు. ఆర్ఎఫ్సిఎల్ ఉత్పత్తిలో తమ వంతు సహకారాలు అందించడంతో పాటు త్వరలో ఆర్ఎఫ్సిఎల్ సందర్శించాలని సిపిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్సిఎల్ ఉన్నత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనరసింహని కలిసిన మెదక్ పార్లమెంట్ అభ్యర్థి

- ఎంపి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు
- నీలం మధు ముదిరాజ్


**టి మీడియా, మార్చ్ 28, మెదక్ :**



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారిని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ హైదరాబాదులోని మినిస్టర్ క్వాటర్స్ లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనను మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ కు రుణపడి ఉంటానన్నారు. ఇందిరా గాంధీ లాంటి మహా నేత ప్రాతినిధ్యం వహించిన ఈ గడ్డ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి దామోదర్ సలహాలు, సూచనల మేరకు ఆయన మార్గదర్శకత్వంలో అందర్నీ కలుపుకుని ముందుకు వెళ్లి మెదక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 15 నిమిషాలు నింగిలో ఎగిరిన ఎల్సీఏ మార్క్ 1ఏ ఫైటర్ విమానం

**టీ మీడియా, మార్చి 28, బెంగుళూరు:**



మేడిన్ ఇండియాలో భాగంగా నిర్మించిన లైట్ కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ మార్క్ 1ఏ ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్ గురువారం తొలిసారి గగనవీధుల్లో ఎగిరింది. మార్క్ 1ఏ ఫైటర్ విమానం పరీక్ష బెంగుళూరులో విజయవంతంగా ముగిసినట్లు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. తన తొలి ఫ్లయిట్లో ఆ విమానం సుమారు 15 నిమిషాల పాటు గగనవీధిలో విహరించినట్లు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ అధికారులు చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మార్క్ 1ఏ ఫైటర్ విమానం భారతీయ చరిత్రలో కొత్త మైలురాయిని లిఖించింది. ఆ విమానం 1.15 నిమిషాలకు టేకాఫ్ తీసుకున్నది. 1.33 నిమిషాలకు అది ల్యాండ్ అయ్యింది. చీఫ్ టెస్ట్ పైలెట్ కేకే వేణుగోపాల్ ఆ ఫైటర్ విమానాన్ని నడిపారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. నూతన గృహప్రవేశం కార్యక్రమంలో,డోలహరణం చిన్నపిల్లల ఉయ్యాల ఫంక్షన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కాకుల సతీష్, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గోపాల్పేట్ మండల్ ఇన్చార్జి సత్య శీలా రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, కౌన్సిలర్స్ వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, చీర్ల సత్యం, లక్ష్మీ రవి యాదవ్, జయసుధ మధు గౌడ్, సుమిత్ర యాదగిరి, విభూతి నారాయణ, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ, తిరుపతయ్య, ఆదిత్య, కరాటే శ్రీను, సురేష్, వినయ్, నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు బహుమతిగా హెల్మెట్

**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**




నూతన వధూవరులకు హెల్మెట్, కాటన్ బ్యాగులు బహుమతి ఇచ్చిన ప్రేమ్ టైలర్స్ నానమోని మన్నెం. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి మీ ప్రాణాలు కాపాడుకోండి. ప్లాస్టిక్ కవర్లు వాడరాదని కాటన్ బ్యాగులు మనం బజారుకు పోయినప్పుడు కాటన్ బ్యాగులు వాడాలని ముద్రించి హెల్మెట్ ధరించాలని ముద్రించి. బ్యాగులు గురువారం రోజున గుండ్యా వాల్యా నాయక్ తండ కోడేరు మండలం, నాగర్ కర్నూలు జిల్లా లోని డీలర్ లక్ష్మణ్ నాయక్ కూతురు పెళ్లి హరిత రఘు నాయక్ కు హెల్మెట్ బహుమతిగా, ప్లాస్టిక్ వాడ రాదని కాటన్ బ్యాగులు బహుమతిగా ఇచ్చిన వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా ప్రేమ్ టైలర్ నానమోని మన్నెం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించండి. రక్షణ పొందండి. ప్లాస్టిక్ కవర్లను నిర్వారించండి. పర్యావరణాని కాపాడండి అన్నారు. ఈ పెండ్లి వెంకటస్వామి నాయక్, తుకారం నాయక్, లక్ష్మణ్ నాయక్, జగదీష్ టైలర్, మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై ఉన్న వైన్స్ పై చర్యలు తీసుకోవాలి

- ఎక్సైజ్ సిఐ కి ఏఐవైఎఫ్ వినతి
- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్

**టీ మీడియా, మార్చి 28, గోదావరిఖని :**



రాజీవ్ రహదారిని ఆనుకోని గోదావరిఖని బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న శ్రీ రాజ్యలక్ష్మి వైన్స్ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ హైవేపై వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారినందున సదరు వైన్స్ పై చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులేని ప్రాంతానికి షాపును కేటాయించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మంగమ్మ కు గురువారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ...రాజీవ్ రహదారిపై గోదావరిఖని బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న శ్రీ రాజ్యలక్ష్మి వైన్స్ బస్టాండ్ నీ ఆనుకొని ఉండటం వల్ల బస్టాండుకు వచ్చే మహిళలకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకురవుతున్నాయని అలాగే వైన్స్ కు వచ్చే వ్యక్తులు వాహనాలను షాపు ఎదురుగా పార్కు చేయడం మూలంగా హైవేపై ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ వైన్స్ పైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరినట్టు తెలిపారు. గతంలో సైతం అనేక యాక్సిడెంట్లు జరిగిన సందర్భాలు ఉన్నాయని ఎలాంటి సర్వీస్ రోడ్డు లేకపోవడం వలన షాపు నుండి వచ్చే మద్యం ప్రియులు చూసుకోకుండా అనేక ప్రమాదాలకు గురికావడం జరుగుతుందని కావున ప్రయాణికుల భద్రత దృష్ట్యా వైన్స్ కు వచ్చే ప్రజల భద్రత దృష్ట్యా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేని ప్రాంతానికి ఈ వైన్సు్ను తరలించాలని అలాగే ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ రాజ్యలక్ష్మి వైన్స్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైవేపై ఇబ్బందిగా ఉన్న వైన్సు్ను తరలించడానికి ఎక్సైజ్ శాఖ తో పాటు ట్రాఫిక్ మరియు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆశాల నవీన్ జిల్లా కోశాధికారి తాళ్లపల్లి సురేందర్,రణవేణి సుధీర్ కుమార్ ఉన్నారు.


## గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీరంగాపూర్ మండల్ నాగసాని పల్లె గ్రామానికి చెందిన వ్యక్తులు ఆంజనేయులు,చెన్నమ్మ, సాయమ్మ , సాయి తేజ, చిన్న బిసన్న, చెన్నమ్మ, చిట్టెమ్మ, శంకరమ్మ, నాగసాని పల్లె పాన్గల్ మండలం బుసిరెడ్డి పల్లె గ్రామంలో పెళ్లికి వెళ్లే మార్గంలో తుఫాన్ అదుపుతప్పి గాయపడ్డారు. వారిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వనపర్తి ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. గాయపడిన ఆంజనేయులు, సాయి తేజను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ హాస్పిటల్ కి తరలించడం జరిగింది. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ కి సూచించారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని అన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.



## పలు వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రావుల


**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో పలు వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి గురువారం చెలిమిల్ల మాజీ సర్పంచ్ రవి నాయుడు కుమారుడు నవీన్ నాయుడుషవివాహానికి హాజరై వధూవరులను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమములో రాజశేఖర్, దిలీప్ రెడ్డి, రామకృష్ణ,మాధవ్ రెడ్డి, కొత్తకోట బాలయ్య నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

## దస్తగిరి పిటిషన్ను తిరస్కరించలేం

- తెలంగాణ హైకోర్టు

**టీ మీడియా, మార్చి 28, హైదరాబాద్:**



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో.. ఎంపీ అవినాష్ రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసులో అప్రూవర్గా మారిన దస్తగిరికి బెయిల్ రద్దు చేయాలని కోరే అధికారం లేదని అవినాష్ తరపు న్యాయవాది వాదించారు. నెల రోజుల క్రితమే ఎన్ఐఏ కేసులో అప్రూవర్ వేసిన పిటిషన్ను డివిజన్ బెంచ్ అనుమతించిందని హైకోర్టు పేర్కొంది. అప్రూవర్కు అడిగే హక్కు ఉందని డివిజన్ బెంచ్ తీర్పులో స్పష్టంగా ఉందని తెలిపింది. ఈ మేరకు దస్తగిరి పిటిషన్ను తిరస్కరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 4కు వాయిదా వేసింది. మరోవైపు భాస్కర్రెడ్డి, ఉదరు కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్లపై సీబీఐ కౌంటర్ దాఖలు చేయగా.. విచారణను హైకోర్టు ఏప్రిల్ 3కు వాయిదా వేసింది.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా నిలిచిన ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు

- నవీన్ రెడ్డి గెలుపు ఖాయం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :** మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ అభ్యర్థి నవీన్ రెడ్డికి మద్దతు ఇచ్చి ఓటు వేసిన ఉమ్మడి జిల్లా జెడ్పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్లకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధికార పార్టీ ప్రలోబాలకు లోంగకుడా పార్టీకి మద్దతు ఇచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలిపారు అని ధర్మం విజయం సాధిస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నవీన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన మాజీ ఎం.ఎల్. ఎలకు, రాష్ట్ర, జిల్లా నాయకులకు, పార్టీ కార్యకర్తలకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. మొక్కవోని ధైర్యంతో ఎం.ఎల్.సి అభ్యర్థి నవీన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన విధంగానే పార్లమెంట్ ఎన్నికలలో కూడా పని చేసి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ జి. చిన్నారెడ్డి



**టీ మీడియా, మార్చి 28, రేవల్లి :** ఘనపూర్ మండలం, సోలిపూర్ గ్రామం, మహేష్ పెళ్లి కి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి. బుధవారం నూతన వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు కె.బాల్ రెడ్డి, శ్యామ్, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు పోసి దుస్తులు దగ్ధం



**టీ మీడియా, మార్చి 28, మహానంది:** గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి దుస్తులను దగ్ధం చేసిన ఘటన బుధవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని సుంకుళమ్మ గుడికి వెళ్లే రాస్తాయందు అదే గ్రామానికి చెందిన సాకలి చిన్న సుంకన్న, లక్ష్మమ్మ దంపతులు బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తుంటారు. గురువారం ఉదయం నానబెట్టిన దుస్తులను ఉతకడానికి వెళ్లి చూడగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పు అంటించినట్లు వారు తెలిపారు. ఎవరో కావాలని కాల్చినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అంజనీపుత్ర సంస్థ ఛైర్మన్ శ్రీధర్ జన్మదిన వేడుకలు





**టీ మీడియా, మార్చి 28, రామకృష్ణాపూర్ :** అంజనీ పుత్రసంస్థ ఛైర్మెన్ గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలను శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ అభిమానులు, మిత్రులు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వదించారు. అంజనిపుత్ర సంస్థ ఎండీ పిల్లి రవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంచిర్యాల మున్సిపల్ చైర్మెన్ ఉప్పలయ్య, పలువురు వక్తలు మాట్లాడుతూ స్వయం కృషీ, మంచి వ్యక్తిత్వం కలిగి ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా నమ్మకమైన సేవలందిస్తూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చు కోవడం సంతోష దాయకమన్నారు. సమున్నత లక్ష్యాల తో ముందుకు సాగుతూ అందరికీ స్ఫూర్తి గా నిలుస్తున్న ఆయన సేవలు సమాజానికి ఎంతో ఉపయోగ కరమన్నారు. ఈ వేడుకల్లో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటవ్ డైరెక్టర్ లు సంతోష్, కిషన్, అభిమానులు, కస్టమర్ లు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డా.ఆదిత్య రెడ్డి



**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలో ఎంబి గార్డెన్ ఫంక్షన్ హాల్ నందిమల్ల రామస్వామి కుమారుడి వివాహానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి కుమారుడు ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య రెడ్డి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార కమిటీ జిల్లా అధ్యక్షులు నందిమల్ల యాదయ్య, రేవెల్లె మండల మాజీ జెడ్పిటిసి రాజేశ్వర్ రెడ్డి, జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎం దేవన్న యాదవ్ బాబా, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖిలా గణపురం మండలం సోలీపూర్ గ్రామంలో మహేష్ పెళ్లికి హాజరైన ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, ఎం దేవన్న యాదవ్, నరేందర్, సయ్యద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీనివాస్ గౌడ్



**టీ మీడియా, మార్చి 28, వనపర్తి బ్యూరో :** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని చిన్నంబావి మండలం పెద్ద దగడ గ్రామంలో జరిగిన (ఆనంద్ గౌడ్-శ్రావణిలా) వివాహానికి వారి కుటుంబ సభ్యులు సత్తూరి జయమ్మ- జగన్నాథం గౌడ్ ఆహ్వానం మేరకు గురువారం శ్రీ గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన దాంపత్య జీవితంలో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## ఎన్నికలకు ఆదాయపు పన్ను శాఖ 24ఐ7 కంట్రోల్ రూమ్



**టీ మీడియా, మార్చి 28, హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో అక్రమ నగదు ఆభరణాల దుర్వినియోగాన్ని పర్యవేక్షించడానికి, అరికట్టడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆదాయపుపన్ను శాఖ, హైదరాబాద్ విభాగం 24ఐ7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. ప్రజలు తమ ఫిర్యాదులు నమోదు చేసుకునేందుకు, ఫోన్ కాల్, వాట్సాప్, ఇ-మెయిల్ ద్వారా సమాచారాన్ని అందించవచ్చని ప్రకటించారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్-2024 విడుదలై దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ నిరంతరాయ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు/నగల దుర్వినియోగాన్ని పర్యవేక్షించడం, అరికట్టడం కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా 24గంటలూ, వారంలో ఏడు రోజులూ (24ఐ7) పని చేస్తుంది. పౌరులు ఎన్నికల ప్రయోజనం కోసం నిల్వ చేయబడిన/రవాణా/ పంపిణీ చేయబడిన నగదు/ ఆభరణాల సమాచారం అందించవచ్చని ఆదాయపు పన్ను శాఖ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రంలోని ఏ జిల్లాకైనా అటువంటి సమాచారాన్ని అందించడానికి వీలుగా సంప్రదింపు నెంబర్లు, ఇ-మెయిల్, అడ్రసును ఉపయోగించవచ్చు.


ఫిర్యాదులు, సమాచారం అందించేందుకు

టోల్ ఫ్రీ నెంబర్: 1800-425-1788ల్యాండ్‌లైన్నెంబర్: 040-23426201/ 23426202

వాట్సాప్ నెంబర్: 91-8688701400

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల అక్రమంలో సంచలన విషయాలు

- మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్ రేగా కార్యలయాల సిబ్బంది
- బాధితుల కోసం సాగుతున్న విచారణ



**టీ మీడియా, మార్చి 28, హైద్రాబాద్ బ్యూరో :** బాధితులకు అందాల్సిన ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కుల సొమ్ము రూ.10.50 లక్షలను కాజేసిన నలుగుర్ని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన నరేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు దగ్గర సహాయకుడిగా పనిచేసిన కొర్లపాటి వంశీ, అసెంబ్లీలో అటెండర్‌గా పనిచేసే బాలగోని వెంకటేశ్, గోదావరిఖనికి చెందిన పులిపాక ఓంకార్ ఉన్నారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మెదక్ జిల్లా పీర్లతండాకు చెందిన పి.రవినాయక్ తన భార్య చికిత్స ఖర్చుల కోసం జనవరి 2023లో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడిచినా సాయం అందకపోవడంతో ఆయన సచివాలయానికి వెళ్లి ఆరా తీశారు. రూ.50 వేలు, రూ.37,500ల చొప్పున రెండు చెక్కులు మంజూరైనట్లు తెలుసుకున్నారు. వాటిని నరేశ్‌కుమార్‌కు అప్పగించినట్లు తెలుసుకొని.. అతడ్ని పలుమార్లు కలిసినా స్పందనలేదు. నరేశ్.. ఆ చెక్కుల్ని వెంకటేశ్, కొర్లపాటి వంశీ, ఓంకార్‌లతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5లోని ఎస్‌బీఐ నుంచి డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ నెల 21న రవినాయక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నరేశ్‌కుమార్, వెంకటేశ్, వంశీ, ఓంకార్‌లను అరెస్టు చేసినట్లు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శాసనసభ ఎన్నికల కోడ్ సమయానికి హరీశ్‌రావు కార్యాలయానికి దాదాపు 250కుపైగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చాయి. వీటిని తిరిగి సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయంలోనే అప్పగించాలని హరీశ్‌రావు సూచించినా.. నరేశ్‌కుమార్ పట్టించుకోలేదని పోలీసులు గుర్తించారు. 19 చెక్కులు డ్రా చేసుకొని.. సుమారు 200 చెక్కులు దహనం చేసినట్లు విచారణలో తేలింది. చెక్కులు తీసుకోవడానికి ముందుకు రాని వారిని లక్ష్యంగా చేసుకుని.. అదే పేర్లతో ఉండే నకిలీ వ్యక్తులను బ్యాంకులకు తీసుకెళ్లి నిందితులు మోసానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది.

### నరేశ్‌తో మాకు సంబంధం లేదు: హరీశ్‌రావు కార్యాలయం

నరేశ్‌కుమార్ అనే వ్యక్తితో తమకు ఎలాంటి సంబంధం లేదని హరీశ్‌రావు కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. "మంత్రిగా హరీశ్‌రావు పదవీకాలం పూర్తయిన తర్వాత నరేశ్ ఎలాంటి సమాచారం లేకుండా కొన్ని సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల్ని తీసుకెళ్లినట్లు తెలిసింది. నరేశ్ మీద డిసెంబరు 17న నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేశాం. నరేశ్‌తో హరీశ్‌రావుకు, ఆయన కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు" అని మాజీ మంత్రి కార్యాలయం తెలిపింది.

## గండిపేటలో భారీ అగ్ని ప్రమాదం.. 25 కార్లు దగ్ధం



**టీ మీడియా, మార్చి 28, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా గండిపేట సమీపంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఖానాపూర్‌లోని ఓ కార్ల గోదాంలో భారీగా మంటలు చెలరేగాయి. అగ్ని కీలలు ఎగిసిపడటంతో గోదాంలో ఉన్న కార్లన్నీ మంటల్లో తగలబడ్డాయి. గోదాంలో 25 కార్లు ఉండగా.. అవన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ మంటల కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో స్థానికులు భయాందోళనలత్రయాయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నారు. కాగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## రాయలసీమను జగన్ సైకో రాజ్యంగా మార్చారు

### టీడీపీ అధినేత చంద్రబాబు



**టీ మీడియా, మార్చి 28, రాప్తాడు :** ఏపీ ముఖ్యమంత్రి జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశారని, రాయలసీమను జగన్ సైకో రాజ్యంగా మార్చారని విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో గురువారం చంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందన్నారు. 90 శాతం హామీలను నెరవేర్చానని జగన్ చెప్పుకుంటున్నారని%ూ% తాను అడిగే ఏడు ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలని అన్నారు. ప్రత్యేక హోదా, మద్య నిషేధం, సీపీఎస్ రద్దు, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, కరెంటు ఛార్జీల తగ్గింపు, పోలవరం పూర్తి తదితర హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. రాయలసీమను తాము హార్టికల్చర్ హబ్‌గా చేశామని జగన్ వచ్చిన తర్వాత రాజకీయ హత్యలతో సైకో రాజ్యంగా మార్చేశారని దుయ్యబట్టారు. గోదావరి జలాలను రాయలసీమ వరకు తీసుకొచ్చే బాధ్యత తమదని చెప్పారు. రాయలసీమలోని 52 అసెంబ్లీ ఎన్నికల్లో 49 చోట్ల వైసీపీని గెలిపిస్తే%ూ% జగన్ ఒరగబెట్టింది ఏముందని ప్రశ్నించారు. అసమర్థుడు, అవినీతిపరుడైన జగన్‌ను ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమయిందని చంద్రబాబు అన్నారు. అక్రమ కేసులు, బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని చెప్పారు. ఎన్నికలకు ముందు ఆత్మబంధువులా ముద్దులు పెట్టి, తలలు నిమిరి ఆస్కార్ లెవెల్లో నటించాడని%ూ% అధికారంలోకి వచ్చాక అసలైన రూపాన్ని చూపించాడని విమర్శించారు.

## సిజెఐకి లేఖ రాసిన 600 మంది న్యాయవాదుల బృందం



**టీ మీడియా, మార్చి 28, న్యూఢిల్లీ :** స్వార్థ ప్రయోజనాలతో కూడిన రాజకీయ మూకలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకువస్తున్నారని సుమారు 600 మంది న్యాయవాదులు బృందం సిజెఐ డి.వై చంద్రచూడ్‌కి లేఖ రాసింది. సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్రా సహ పలువురు న్యాయవాదులు బుధవారం లేఖ రాశారు. ఆ మూకలు కోర్టుల పరువు తీసేందుకు యత్నిస్తున్నారని, పనికిమాలిన తర్కాలతో తమ రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ కేసుల్లో, ముఖ్యంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతల ఒత్తిడి వ్యూహాలు స్పష్టంగా వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. వారి వ్యూహాలు న్యాయస్థానాలను దెబ్బతీయడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు కలిగిస్తున్నాయని ఆ లేఖలో తెలిపారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మధ్య కొందరు న్యాయవాదులు పగలు రాజకీయ నాయకులను సమర్థించడం, రాత్రి మీడియాతో న్యాయమూర్తులను ప్రభావితం చేయడం వంటి అంశాలు బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని, ఇలాంటి వాటిపై మౌనంగా ఉంటే.. హాని చేయాలనుకునేవారికి మరింత బలం ఇచ్చినట్లేనని పేర్కొన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## సీఎం ని కలిసిన మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

### -పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృతజ్ఞుణ్ణి



**టీ మీడియా, మార్చి 28,మెదక్:** గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా%శీ%..తనపై నమ్మకంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీలం మధు ముదిరాజ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అందరి సహకారంతో మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు స్థానానికి తనను ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని ఈ విషయాన్ని విరివిగా ప్రజల్లోకి తీసుకొని వెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపొందేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావుల ఆశిస్సులతో పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలుపుగోలుగా ఉంటూ కాంగ్రెస్ శ్రేణుల సహకారంతో మెదక్ సీటును కాంగ్రెస్ ఖాతాలో వేస్తామని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు యూనిఫామ్ అందించిన న్యూలాండ్ పరిశ్రమ ప్రతినిధులు



**టి మీడియా, మార్చి 28, గుమ్మడిదల :** గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తమ స్కూలు లో 250 మంది విద్యార్థులు విద్యార్థులు చదువుతున్నారని వారికి స్కూలు యూనిఫాం విషయమై న్యూలాండ్ మేనేజ్మెంట్ వారిని అభ్యర్థించాగ. పరిశ్రమ మేనేజ్మెంట్ సానుకూలంగా స్పందించి స్కూలు విద్యార్థులకు యూనిఫామ్ కొరకు ఐదు లక్షల వ్యయంతో రెండు జతల యూనిఫామ్ ఒక జత స్పోర్ట్స్ యూనిఫామ్ పరిశ్రమ ప్రతినిధులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మంచిగా చదువుకోవాలని అన్నారు మంచిగా చదువుకున్నప్పుడే సమాజంలో మంచి పేరు వస్తుందని అన్నారు అదేవిధంగా పరిశ్రమ ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవడం సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో న్యూలాండ్ మేనేజ్మెంట్ జి.యం.హె.ఆర్ రవి ఏ.జి.యం మురళీకృష్ణ డాక్టర్ అడ్రియన్ యూనిట్ హెచ్.ఆర్ శ్రీహర్ష, ప్రసాద్ పాల్గొన్నారు. స్కూలు టీచర్లు మేనేజ్మెంట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు భవిష్యత్తులో ఇటువంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఇంకా చేపట్టాలని వారు కోరారు.



### కాంగ్రెస్ నిర్లక్ష్య విధానాలతో

## ఆగమైపోతున్న రైతులు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**టీ మీడియా, మార్చి 28, సిరిసిల్ల:** కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు

## కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోంది: సునితా కేజ్రీవాల్



**టీ మీడియా, మార్చి 28,న్యూఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నదని ఆయన భార్య సునితా కేజ్రీవాల్ తెలిపారు. ప్రస్తుతం ఈడీ కస్టడీలో కేజ్రీ ఉన్న విషయం తెలిసిందే. మరో నాలుగు రోజుల పాటు ఈడీ కస్టడీని పొడిగించారు. ఆ ప్రకటన రావడానికి కొన్ని క్షణాల ముందు ఆమె ఈ విషయాన్ని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగాలేదని, మన సీఎంను వేధిస్తున్నారని, ప్రజలు దీనికి తగిన సమాధానం ఇస్తారని సునితా కేజ్రీవాల్ అన్నారు. రౌజ్ ఎవన్యూ కోర్టు ప్రాంగణంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మార్చి 21వ తేదీన మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. తొలుత మార్చి 28వ తేదీ వరకు రిమాండ్‌కు పంపారు. ఇవాళ మళ్లీ ఆ కస్టడీని ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పొడిగించారు.

## జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఉద్యోగ పరీక్ష వాయిదా

**టీ మీడియా, మార్చి 28,హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ), కెమిస్ట్ ఉద్యోగాల నియామక రాత పరీక్ష వాయిదా పడింది. ఎన్నికల కోడ్ కారణంగా ఈ నెల 31న జరగాల్సిన పరీక్షలను జెన్‌కో వాయిదా వేసింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పరీక్షల తేదీని ప్రకటిస్తామని పేర్కొంది. జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజినీర్, 60 కెమిస్ట్ పోస్టులను ప్రత్యక్ష, రెగ్యులర్ నియామకాల పద్ధతిలో భర్తీ చేసేందుకు సంస్థ యాజమాన్యం ప్రకటన జారీచేసిన విషయం తెలిసిందే.




## ఏపీకి ముగ్గురు ఎన్నికల పరిశీలకులు నియామకం

**టీ మీడియా, మార్చి 28,అమరావతి:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీకి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ జనరల్ అబ్జర్వర్ గా రిటైర్డ్ ఐఏఎస్ రామ్ మోహన్ మిశ్రా, స్పెషల్ పోలీస్ అబ్జర్వర్గా రిటైర్డ్ ఐపీఎస్ దీపక్ మిశ్రా, స్పెషల్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్గా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ నియమితులయ్యారు. వచ్చే వారం నుంచి ప్రత్యేక ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులపై నిఘా పెట్టనున్నారు. అనుమానం వచ్చిన వారిపై పరిశీలకులు పరిశీలించనున్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు పరిశీలకులు.